క్లుప్తంగా

చికిత్స పొందుతూ గీతకార్మికుడి మృతి

ఎల్కతుర్తి : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దామెర గ్రామానికి చెందిన పాటి రాజమొగిలి (48) అనే గీతకార్మికుడు రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినప్పటికీ నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాజమొగిలి ఈనెల 17న కౌలు చేస్తున్న పత్తిచేనులో గుర్తు తెలియని పురుగుమందు తాగాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పత్తిచేను వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు. హుటాహుటిన చికిత్స నిమిత్తం 108వాహనంలో ఎంజీయం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రాజమొగిళి పరిస్థితి విషమించి తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర భజన మండలి సభ్యులు బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన సంకీర్తన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు మోతుక్కూరి భాస్కర్, సభ్యులు భాగ్య, పెండ్యాల పూలమ్మ, లక్ష్మి, లలిత, పూలమ్మ, వనమ్మ, స్వప్న, సూరమ్మ, మనిలా, రాజక్క, పూలమ్మ పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి



ఆత్మకూరు : విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని ప్రథమ్ ఎడ్యుకేషనల్ క్లబ్ ప్రతినిధి మంద రవి అన్నారు. జెడ్పీహై స్కూల్‌లో విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం నిర్మల కుమారి, శ్రీహరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని సందర్శించిన నైమిశరణ్య పీఠాధిపతి



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్రస్వామి ఆలయాలన్ని నైమిశరణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి బుధవారం సందర్శించారు. ఆలయ అర్చకులు, కార్యనిర్వహణ అధికారి కిషన్‌రావు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వీరభద్ర స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో ఏకబిల్వ మొక్కలు నాటారు. అనంతరం శ్రీ శివలీల విలాసం ప్రవచన కార్యక్రమంలో భాగంగా ప్రపంచానికి భారతదేశం పూజ గది వంటిందని ఈదేశంలో నిర్వహించే యజ్ఞ యాగాల వల్ల సమస్త ప్రపంచం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. శివుడు ఐశ్వర్యకారుడని, లయకారుడని మృతువుని తొలగించేవాడని, కాలాతీతుడని విశ్వవ్యాప్తమైన ముక్కంటి కన్నుల నుంచి ఎవ్వరూ తప్పించుకోవడం సాధ్యం కాదని తెలిపారు. మానవుల పాపపుణ్యాలపై పలు ప్రవచించారు. ముఖ్య అర్చకుడు మొగిలిపాలెం రాంబాబు, అర్చకులు వినయ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, రమేశ్, సందీప్, వీరభద్రయ్య, గురుప్రసాద్, చంద్రశేఖర్‌గుప్త, సమ్మయ్య, ఉపేందర్, సదానందం పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో అవగాహన సదస్సు

హన్మకొండ కల్చరల్: హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ఫార్మడీ విద్యార్థులు, అధ్యాపకులు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నష్కల్ గ్రామంలో బుధవారం అవగాహన సదస్సు, రోగులకు కౌన్సెలింగ్ శిబిరం నిర్వహించారు. నాలుగో నేషనల్ ఫార్మ కోవిజిలెన్స్ వీక్ సెలబ్రేషన్స్ థీమ్ బిల్డింగ్ ఏడీఆర్ రిపోర్టింగ్ కల్చర్ ఫర్ పేషంట్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా వాగ్దేవి ఫార్మడీ హెచ్‌ఓడీ డాక్టర్ శరవణభవ, డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డయాబెటిస్, హైపర్‌టెన్షన్, బ్యాక్ పెయిన్, హిప్ పెయిన్, ఏఆర్‌డీ రిపోర్టింగ్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫార్మడీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్లు గిరిజతో పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. డ్రెయినేజీ మరిచారు

- దారి వెంబడి పారుతున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

ధర్మసాగర్ : మండలంలోని సాయిపేట గ్రామంలో ఇటీవల రోడ్డు నిర్మించారు. కానీ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో పలు కాలనీల్లోని డ్రెయినేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. మూడు సంవత్సరాల క్రితం మండలంలోని సాయిపేట క్రాస్ రోడ్డు నుంచి వేలేరు మండల కేంద్రం వరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్.. అవసరం ఉన్న చోట సీసీ రోడ్డు వేసి మిగతా రోడ్డు మొత్తం బీటీ రోడ్డు నిర్మించారు. అయితే సాయిపేట రోడ్డు వేసి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టలేదు. సీసీ రోడ్డు ఎత్తుగా ఉండంతో గతంలో నిర్మించిన డ్రెయినేజీ పూర్తిగా కిందకి కూడుకుపోయింది. దీంతో గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, వివిధ కాలనీల నుంచి వచ్చే మురికినీరు రోడ్డుపై ప్రవహిస్తు దుర్గంధం వెదజల్లుతుంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన రోడ్డుతో పాటు కాలనీల్లో డ్రెయినేజీని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



మురుగునీరుతో బురదగా మారిన రోడ్డు



డ్రెయినేజీ లేక రోడ్డుపైకి వస్తున్న మురికి నీరు

డ్రెయినేజీ సమస్య వాస్తవమే

సాయిపేట గ్రామంలో డ్రెయినేజీ సమస్య ఉన్నది వాస్తవమే. గ్రామస్తుల సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాను. ప్రధాన రోడ్డుకిరువైపు నూతన డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దానికి పెద్దమొత్తంలో నిధులు అవసరం కానున్నాయి. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తా. గ్రామస్తులు సంయవనం పాటించాలి.

- వెంకన్న, పంచాయతీ కార్యదర్శి

నిజాయితీ చాటుకున్న బేకరి యజమాని

పరకాల : పట్టణంలోని ఓ బేకరిలో మహిళ తన పర్సును మరిచిపోయి వెళ్లింది. పర్సులో ఉన్న ఆధార్ కార్డు ద్వారా మహిళ అడ్రస్ తెలుసుకున్న అల్పా బేకరి యజమాని రిజ్వాన్‌రాజా ఆమె ఇంటికి వెళ్లి పర్సు, అందులో ఉన్న రూ.8,500 నగదు ఇవ్వడంతో ఆమె సంతోషంతో కృతజ్ఞతలు తెలిపింది. బేకరి యజమాని నిజాయితీని పలువురు ప్రశంసిస్తూ అభినందించారు.



మహిళకు పర్స్ అందజేస్తున్న రిజ్వాన్‌రాజా

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యూత్ సభ్యులు రమేశ్, వినయ్, భరత్‌చంద్ర, సంపత్, రవితేజ, రవికుమార్, నరేష్, నవీన్ బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతిపత్రం అందించారు. అలాగే మాందారిపేట స్టేజీ వద్ద ఎస్సీ, బీసీ గృహాలపై నుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ వైర్లను తొలగించి ఇతర ప్రదేశంలో ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. వివిధ సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సూచిక బోర్డును సరిచేసిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

వేలేరు : పీచర క్రాస్ రోడ్డు నాలుగు కూడళ్ల వద్ద వివిధ గ్రామాలకు వెళ్లే దారిని సూచించే సూచిక బోర్డును తప్పుగా ఏర్పాటు చేయడంతో సాక్షి దినపత్రిక ఈనెల 14న 'ఊరు ఒకవైపు..సూచిక మరోవైపు' కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు సూచిక బోర్డును సరి చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి పలువురు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎడ్లబండిలో గణపతి శోభాయాత్ర



ఎడ్లబండిపై శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్‌లో బుధవారం గణపతి నిమజ్జనం వైభవంగా జరిగింది. వినాయక విగ్రహాన్ని ఎడ్లబండిపై ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. భక్తులు మొక్కులు సమర్పించారు. యువకులు కేరింతలు, డ్యాన్సుల నడుమ నిమజ్జనం ముగిసింది.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు సబ్‌డివిజన్ ఏడీ పరిధిలోని కొత్తకొండ, నారాయణగిరి, భీమదేవరపల్లి పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గురువారం ముల్కనూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే విద్యుత్ వినియోగదారుల సదస్సును వినియోగించుకోవాలని ఏఈ లక్ష్మణ్‌నాయక్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, వినియోగం కంటే ఎక్కువ బిల్లులు రావడం, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దుతో పాటు తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

వేలేరు : నేడు భీమదేవరపల్లి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏఈ కుమారస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

పంటలసాగుపై అవగాహన కలిగి ఉండాలి



గ్రామ పటం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

కమలాపూర్ : మండలంలోని రైతులు తాము సాగు చేస్తున్న పంటలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఆర్ విశ్వవిద్యాలయ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు (పీఆర్ఏ)నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు కమలాపూర్ గ్రామ భౌగోళిక స్వరూపానికి సంబంధించిన చిత్ర పటాన్ని రూపొందించారు. గ్రామంలోని చెరువులు, కుంటలు, నీటి వనరులు, వ్యవసాయ భూములు, సన్న, చిన్నకారు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడంతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల వద్ద అధిక వడ్డీ రేటుకు డబ్బులు తీసుకుని పెట్టుబడులు పెట్టడం రైతులకు నష్టం చేయబోతోందని వివరించారు. ఇందుకు పరిష్కార మార్గాలను క్లుప్తంగా రైతులకు వివరించారు. వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ భూపాల్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఏడబ్ల్యూఈపీ కో ఆర్డినేటర్ శ్రీకర్‌రెడ్డి, విలేజ్ కో ఆర్డినేటర్ సాయికృష్ణారెడ్డి, ఏఓ లక్ష్మారెడ్డి, ఏఈఓ రహీం, వ్యవసాయ విద్యార్థులు రుత్విక్, రవి, వరుణ్ యాదవ్, నూతన్ ఆర్య, రైతులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకోవాలి

ఆత్మకూరు : అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరిలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. 8800002024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు పొందాలని అన్నారు.

గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం

నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామ ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ శ్రీనివాస్, నడికూడ, చౌటుపర్తి గ్రామాలకు ఎంపీఓ చేతన్ కుమార్ రెడ్డిని నియమించినట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

రేపు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం

ఎల్కతుర్తి : మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఈనెల 20వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మండల కేంద్రంలోని కార్మెల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రాముడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్-14, 17 బాల బాలికలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే బాలబాలికలు కార్మెల్ పాఠశాలలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ క్రీడాపోటీల ఎంపికలో ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువకునే విద్యార్థులు అందరూ పాల్గొనాలని కోరారు.

చర్య తీసుకోవాలి

శాయంపేట : వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్ట్‌షాపులపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా హనుమకొండ జిల్లా కార్యదర్శి వంగర సాంబయ్య బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

పీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం

ఎల్కతుర్తి : పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఎల్కతుర్తి మండల కేంద్రంలో బుధవారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ఆయన హనుమకొండ నుంచి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మీదుగా జమ్మికుంటకు వెళ్తున్న క్రమంలో కలిసిన నాయకులు.. మహేష్‌కుమార్‌కు పూలబొకే అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం బాణసంచాలు కాల్చారు. మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సంతాజీ, రాజేశ్వర్‌రావు, సుమన్‌గౌడ్, శ్రీకాంత్, రమేశ్, వెంకటేశ్, అనిల్‌కుమార్, సురేందర్, నవీన్, అయిలయ్య, చంద్రశేఖర్‌గుప్తా, ప్రకాశ్, రాజు, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.



ఎల్కతుర్తిలో పీసీసీ చీఫ్‌ను శాలువాతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పచ్చరంగులో మిషన్ భగీరథ నీరు

శాయంపేట : ఇంటింటికీ శుద్ధి చేసిన తాగు నీరు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. కానీ మండలంలో భగీరథ నీరు ఆకుపచ్చ రంగులో వస్తున్నాయని, ఈ నీరు ఎలా తాగాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కలుషిత నీరు తాగితే అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి శుద్ధి చేసిన తాగునీటిని అందించే విధంగా కృషి చేయాలని కోరుతున్నారు.



పచ్చగా వస్తున్న మిషన్ భగీరథ నీరు

పర్యావరణ పరిరక్షణతో వ్యాధులు దూరం



పరకాల : బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ



ఆత్మకూరు : మానవహారం చేపట్టిన విద్యార్థులు

పరకాల : పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల బారిన పడకుండా ఉంటారని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. స్వచ్ఛతహి సేవ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని మల్లక్‌పేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం పడేయకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్, పంచాయతీకార్యదర్శి సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వచ్ఛతహి సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో వృక్షరూపం మానవహారం నిర్వహించారు.

బీజేపీ నేత అరవింద్‌సింగ్ దిష్టిబొమ్మ దహనం



ఎల్కతుర్తి : అరవింద్‌సింగ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



శాయంపేట : సంజయ్ గైక్వాడ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ నేత, ఢిల్లీ మాజీ ఎమ్మెల్యే అరవింద్‌సింగ్ చేసిన వ్యాఖ్యలపై మండల కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అరవింద్‌సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా రాబోవు రోజుల్లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అరవింద్‌సింగ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాహుల్‌గాంధీకి క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు స్వరూప, నాయకులు అనిల్, కిరణ్, సుమన్, శ్రీకాంత్, రవీందర్, కరుణాకర్, అజయ్, మహేష్, కళావతి, స్వర్ణలత, రవితేజ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై అనుచిత వాఖ్యలు చేసిన మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు బుధవారం మండంలోని మాందారిపేట స్టేజీ వద్ద దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రప్రకాశ్, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ రవీందర్, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, నాయకులు రవి, శాంతరవి, కృష్ణమూర్తి, రమేశ్, కుమారస్వామి, ప్రపంచరెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్

ఎల్కతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా చేవెళ్ల మహాసభలో హామీ ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ఇప్పటికీ అమలు చేయడం లేదని, అంబేడ్కర్ అభయహస్తం కోసం విధివిదానాలు తక్షణమే రూపొందించాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించిందని, కాని ప్రభుత్వం ఏర్పడి 9నెలలు గడుస్తున్నా డిక్లరేషన్ ఊసే ఎత్తడంలేదన్నారు. ప్రభుత్వం అంబేడ్కర్ అభయ హస్తం కోసం రూ.2వేల కోట్లు బడ్జెట్‌లో ప్రకటించారని, కానీ ఆ పథకం అమలుకు మార్గదర్శకాలు రూపొందించలేదన్నారు. దళితుల సమగ్రాభివృద్ధికి ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుల బాధితులకు నష్టపరిహారం అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, రాజ్‌కుమార్, రాజనరుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ సునితారెడ్డి

శాయంపేట : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, తల్లులు, పిల్లలు, పాలు, ఆకు కూరలు, పండ్లు, పోషక ఆహారాలు తీసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. తల్లులు, పిల్లలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, శ్వేత, జ్యోత్స్న, రమాదేవి పాల్గొన్నారు.

గురుకులాల్లో పనివేళలు మార్చాలి

దామెర : గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది పనివేళలను మార్చాలని టీఎస్ యూటీఎఫ్ ఎంజేపీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌లివిన్‌స్టన్ డిమాండ్ చేశారు. ఒగ్లాపూర్ సమీపంలోని మహాత్మా జ్యోతిభా పూలే పాఠశాలలో బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్‌రాజు, రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు సతీష్, మధు, సురేష్, స్రవంతి పాల్గొన్నారు.

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి కోరారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని వివిధ గురుకుల పాఠశాలలు, కళాశాలలతో పాటు కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, గురుకుల పాఠశాలల్లో కేర్ టేకర్లను నియమించాలని కోరారు. బోధనా సిబ్బందిని బోధనేతర పనులకు వినియోగించవద్దని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ లైబ్రేరియన్స్, స్టాఫ్ నర్స్ ప్రమోషన్ చానల్ కల్పించాలని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు పాల్గొన్నారు.



దామెర : ఒగ్లాపూర్ ఎంజేపీలో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు